క్లుప్తంగా

స్టూడెంట్ కిట్ల అందజేత

మండవల్లి: అయ్యవారి రుద్రవరం ఎంపీపీ స్కూల్ (హరిజనవాడ బీపీఎస్) పాఠశాల్లో విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర స్టూడెంట్ కిట్లను శుక్రవారం అందజేశారు. సర్పంచ్ బోనం శేషగిరి, వైస్ సర్పంచ్ ఇంటి నాగరాజు, ఎంపీటీసీ సభ్యుడు శ్రీకృష్ణ యాదవ్, పాఠశాల చైర్మన్ వి.విజయశాంతి, వైస్ చైర్మన్ కె.శ్రీధర్, హెచ్ఎం సీహెచ్ పిచ్చోడు పాల్గొన్నారు. సర్పంచ్ శేషగిరి మాట్లాడుతూ బడిఈడు పిల్లలు ప్రభుత్వ పాఠశాల్లో చేరి, ప్రభుత్వం చేపడుతున్న ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌ను విజయవంతం చేయాలని కోరారు.

ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ

మొవ్వ: మొవ్వ ఎంపీడీఓగా శుక్రవారం డి.సుహాసిని బాధ్యతలు చేపట్టారు. పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు ఎంపీడీఓ పనిచేసిన ఈమె బదిలీపై మొవ్వకు వచ్చారు. సుహాసినికి డెప్యూటీ ఎంపీడీఓ ఎంఎస్ కే పరమాత్మ, కార్యాలయ ఏఓ ఎన్. శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సత్యనారాయణ, జేఏ సీహెచ్ రామ్మూర్తి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కేఎస్ఆర్‌కే ప్రసాద్, గూడపాడు సెక్రెటరీ కొప్పుల అమర్నాథ్ తదితరులు స్వాగతం పలికారు.

ప్రమాదకరంగా కృష్ణాపురం-ఐలూరు రోడ్డు

పమిడిముక్కల: కృష్ణాపురం-ఐలూరు ఆర్అండ్‌బీ రోడ్డు ప్రమాదకరంగా మారింది. రోడ్డంతా గుంతలు పడి, రాళ్లు లేచి ఉంది. వాన పడితే ఈ గుంతల్లో నీరు చేరి రహదారి కనబడని పరిస్థితి నెలకొంది. ఇసుక టిప్పర్లు అధిక లోడుతో వెళ్లడం వలన రహదారి పూర్తిగా ధ్వంసమైంది. శుక్రవారం లోడ్‌తో వెళుతున్న ఓ లారీ గుంతలో కూరుకుపోయింది. గుంతలమయంగా మారిన రహదారికి మరమ్మతులు చేపట్టాలని కూడేరు, ఐనపూరు గ్రామస్తులు కోరుతున్నారు.

కుట్టుమిషన్ బహూకరణ

పమిడిముక్కల: తాడంకి హైస్కూల్‌కు పూర్వ విద్యార్థి కొడాలి పిచ్చేశ్వరరావు దంపతులు రూ.20 వేల విలువైన కుట్టుమిషన్‌ను బహూకరించారు. హైస్కూల్లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో పిచ్చేశ్వరరావు కుట్టుమిషన్‌ను హెచ్ఎం వైఎస్ఎన్ ప్రసాద్‌కు అందజేశారు. టైలరింగ్ నేర్చుకునే విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని కుట్టుమిషన్ అందజేసినట్లు దాత తెలిపారు.

యూపీ స్కూల్‌ను కొనసాగించండి

కైకలూరు: విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్నప్పటికీ నిబంధనల పేరుతో వెలంపేటలో యూపీ స్కూల్‌ను మార్పు చేస్తూ మోడల్ స్కూల్ కొనసాగించడం తగదని వెలంపేట గ్రామస్తులు అధికారులను కోరారు. ఇటీవల స్థానిక ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌తో పాటు ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వికి విద్యార్థుల తల్లిదండ్రులు వినతిపత్రాలు అందించారు. దీంతో డీఈఓ వెంకటలక్ష్మమ్మ, సర్వశిక్ష ఏపీసీ కుర్లెత పంకజ్‌కుమార్ వెలంపేట స్కూల్‌కు శుక్రవారం విచారణకు విచ్చేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ వెలంపేట యూపీ స్కూల్ నుంచి 6, 7, 8 తరగతులను సమీప హైస్కూల్లో విలీనం చేశారన్నారు. వాస్తవానికి 6 నుంచి 8వ తరగతి వరకు దాదాపు 82 మంది విద్యార్థులు ఇక్కడ ఉన్నారన్నారు. హైస్కూల్‌గా మార్పు చేసే అవకాశం ఇక్కడ ఉందన్నారు. ఏపీసీ పంకజ్‌కుమార్ మాట్లాడుతూ ఇక్కడ తెలుసుకున్న విషయాలను జిల్లా అధికారులకు వివరిస్తామన్నారు. ఎంఈఓ డి.రామారావు, గత హెచ్ఎం దానం ప్రసాద్, ఎంపీటీసీ సభ్యురాలు శశికళ, వార్డు సభ్యుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పెనుమాకలంకలో వెలుగు చూసిన అవినీతి

మండవల్లి: మండలంలోని పెనుమాకలంకలో అవినీతి వెలుగుచూసింది. గ్రామస్తుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని సర్పంచ్, అధికారులు పంచాయతీ నిధులను పక్కదారి పట్టించి జేబులు నింపుకున్న వైనం ఇది. ఈ మేరకు సమాచార హక్కు చట్టం ద్వారా జమా ఖర్చులపై నివేదిక కోరిన మాజీ సర్పంచ్‌లు ఘంటసాల శ్రీనివాసు, మరియమ్మ, గ్రామస్తుడు వెంకటరాజు శుక్రవారం వివరాలను వెల్లడించారు. పంచాయతీలో నిధులతో పాటు కొల్లేరు గ్రామాల్లో ఉండే సమాంతర నిధులను వినియోగించుకుని కోట్ల అవినీతికి పాల్పడినట్లు ఆరోపించారు. భారీగా రూ.80 లక్షల వరకు అవినీతి చేశారని తెలిపారు. గ్రామంలో జరిగిన అవినీతిపై సర్పంచ్, కార్యదర్శులపై జిల్లా కలెక్టర్‌కు పీజీఆర్ఎస్‌లో సోమవారం ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

చెరువు తవ్వకం పనులు నిలిపివేత

ముదినేపల్లి రూరల్: అనుమతులు లేకుండా మంచినీటి చెరువు కలుషితమయ్యే ప్రమాదమున్నా ఏమాత్రం ఖాతరు చేయకుండా జరుపుతున్న చెరువు తవ్వకం పనులను సర్పంచ్, గ్రామస్తులు అడ్డుకున్న వైనమిది. మండలంలోని వణుదుర్రు పంచాయతీ పరిధిలో తాగునీటి చెరువు పక్కన 18ఎకరాల్లో అనుమతులు లేకుండా కొంతమంది వ్యక్తులు చెరువు తవ్వకం పనులు మూడు రోజులు కిందట ప్రారంభించారు. చెరువు తవ్వితే తాగునీటి కోసం ఇబ్బందులు పడతారంటూ సర్పంచ్ చిన్నం సుగుణరావు తవ్వకందారులకు తెలిపారు. అయినప్పటికీ ఏమాత్రం ఖాతరు చేయకుండా పనులు కొనసాగిస్తుండడంతో తహసీల్దార్‌కు సర్పంచ్ సహా గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ పనులు కొనసాగించడంతో సర్పంచ్, కొందరు గ్రామస్తులు తవ్వకం పనులను అడ్డుకున్నారు.

అటకెక్కిన చెత్త సేకరణ

- గ్రామాల్లో క్షీణించిన పారిశుద్ధ్యం
- అంటు వ్యాధులు ప్రబలే అవకాశం



లింగవరంలో రోడ్డు పక్కనే పడేసిన చెత్త

గుడివాడరూరల్: గుడివాడ, నందివాడ మండలాల్లోని గ్రామాల్లో చెత్త సేకరణ కార్యక్రమం అటకెక్కింది. దీంతో పారిశుద్ధ్యం క్షీణించింది. డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో కొన్ని రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో రోడ్లు మురికి కూపాలుగా మారాయి. పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నందివాడ మండలంలోని పోలుకొండ, తమిరిశ, ఎల్ఎన్‌పురం, రామాపురం తదితర గ్రామాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. దీంతో దోమలు, ఈగలు విజృంభిస్తుండటంతో అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఆయా గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. గుడివాడ మండలంలోని లింగవరం, వలివర్తిపాడు, తటివర్రు, మోటూరు, శేరీగొల్వేపల్లి తదితర గ్రామాల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది.

చెత్త సేకరణ గాలికి

డెప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాలతో కొన్ని నెలల క్రితం గ్రామాల్లో చెత్త సేకరణ అంటూ హడావుడి చేసిన పంచాయతీ అధికారులు ప్రస్తుతం చెత్త సేకరణను గాలికి వదిలేశారు. చెత్త సేకరణ ప్రతి రోజూ కాకుండా వారికి ఇష్టం వచ్చిన రోజుల్లో చేస్తున్నారు. దీనివలన ఆయా గ్రామస్తులు చెత్త ఎక్కడ వేయాలో తెలియక రోడ్లపైనే పడేయాల్సిన దుస్థితి నెలకొంది. దోమలు, ఈగలు విజృంభిస్తున్నా వాటి నిర్మూలనకు పంచాయతీ అధికారులు, సిబ్బంది ఎటువంటి చర్యలు చేపట్టడం లేదు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు గ్రామాల్లో నెలకొని ఉన్న సమస్యలు పరిష్కరించి వ్యాధుల బారిన పడకుండా కాపాడాలని ప్రజలు వేడుకుంటున్నారు.

అంటు వ్యాధులు ప్రబలుతున్నాయి



గ్రామంలో చెత్త పేరుకుపోవడంతో ఎటు చూసినా దుర్గంధం వెదజల్లుతోంది. డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వీధుల్లోని రోడ్లు మురికి కూపాలుగా మారాయి. ఫలితంగా దోమలు, కీటకాలు ఎక్కువ కావడంతో అంటు వ్యాధులు ప్రబలుతున్నాయి. ఇంత జరుగుతున్నా పంచాయతీ అధికారులకు పట్టడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.
– కె.సాయి, లింగవరం, గ్రామస్తుడు

వైభవంగా జగన్నాథుడి రథయాత్ర



ముదినేపల్లిలో రథయాత్ర

ముదినేపల్లి రూరల్: రెండో పూరీగా ప్రసిద్ధి చెందిన మండలంలోని వడాలి శ్రీజగన్నాథస్వామి రథయాత్ర శుక్రవారం వైభవంగా సాగింది. ప్రతి ఏటా పూరీలో నిర్వహించే జగన్నాథుడి రథయాత్రకు అనుగుణంగా ఇక్కడి జగన్నాథస్వామి ఆలయం వద్ద నుంచి రథయాత్ర కొనసాగించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగానే శ్రీసుభద్ర బలరామ సహిత జగన్నాథుడి విగ్రహాలను రథంపైకి చేర్చి అర్చకులు పూజలు నిర్వహించి ఆలయం వద్ద నుంచి రథయాత్రను ప్రారంభించారు. గ్రామంలోని ప్రధాన వీధుల వెంబడి కొనసాగిన ఈ రథయాత్ర ముదినేపల్లి-బంటుమిల్లి రహదారిపై వడాలి మెయిన్ రోడ్డు నుంచి ముదినేపల్లి ప్రధాన సెంటర్ వరకు కొనసాగింది. ఇక్కడి నుంచి శ్రీహరిపురం మీదుగా సింగరాయపాలెం బావాజీ మఠం వరకు మేళతాళాలు, మంగళ వాయిద్యాలు భక్తుల జనసందోహం మధ్య కొనసాగింది. బావాజీ మఠం నుంచి తిరిగి వడాలి స్వామి ఆలయానికి రథయాత్ర చేరుకుంది. ఎస్ఐ వీరభద్రరావు ఆధ్వర్యంలో రథయాత్ర వెంబడి పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఆలయ ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు పర్యవేక్షణ చేశారు.

కైకలూరులో..

కైకలూరు: పూరీ జగన్నాథుని రథయాత్ర తరహాలో గ్రీన్ విలేజ్‌లో ఇస్కాన్ మందిరం ఆధ్వర్యంలో కైకలూరులో రథయాత్ర శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పలు కూడళ్లలో జగన్నాథ స్వామి, బలదేవ, సుభద్రమయి, సుదర్శనలతో కలిసి రథంపై ఊరేగించారు. భక్తులు పాటలను ఆలపిస్తూ రథం తాడు లాగారు. కార్యక్రమంలో నిర్వాహకులు శ్రీకాంత శ్రీనివాసదాస్, కట్టా విష్ణుమూర్తి, కిలారి నాగేశ్వరరావు, తిరుమల శ్రీనివాస్, రామాంజనేయులు పాల్గొన్నారు.



కైకలూరులో జగన్నాథుడి రథయాత్ర

ఘనంగా ఏఏఎన్ఎం హైస్కూల్ వార్షికోత్సవం



కార్యక్రమానికి జ్యోతిప్రజ్వలన చేస్తున్న అనురాధ

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు ఏఏఎన్ఎం అండ్ వీవీఆర్ఎస్ఆర్ హైస్కూల్లో వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన కృష్ణా జిల్లా మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ గద్దె అనురాధ హైస్కూల్ వ్యవస్థాపకులు దివంగత అడుసుమిల్లి అశ్వర్థ నారాయణమూర్తి, స్వర్గీయ వల్లూరుపల్లి వెంకట రామశేషాద్రిరావు చిత్ర పటాలకు పుష్పాంజలి ఘటించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి వారివురూ విద్యాభివృద్ధికి చేసిన కృషిని వివరించారు. విద్యార్థులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఉన్నత స్థానాలను అధిరోహించిన పి.వి.సింధు, కోనేరు హంపి, మైక్రోసాఫ్ట్ కంపెనీ సీఈఓగా పని చేస్తున్న సత్య నాదెళ్ల, గూగుల్ సీఈఓగా పని చేస్తున్న సుందర్ పిచాయ్ వంటి గొప్ప వ్యక్తులను స్ఫూర్తిగా తీసుకోవాలి అని తెలిపారు. ఈ సందర్భంగా తమ జన్మభూమి గుడ్లవల్లేరు వచ్చినందుకు అనురాధ ఆనందించారు. కార్యక్రమంలో ఎడ్యుకేషన్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్ కొడాలి వెంకట కృష్ణారావు, గుడ్లవల్లేరు మార్కెట్ యార్డ్ చైర్మన్ పొట్లూరి రవికుమార్, ప్రిన్సిపాల్ వీఏ కుంజుమన్, డైరెక్టర్ ఎన్.శ్రీనివాస్ మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ సత్యబాబు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఐ చంటిబాబు

గుడివాడరూరల్: మత్తు పదార్థాలకు యువత, విద్యార్థులు దూరంగా ఉండాలని తాలూకా ఎస్ఐ ఎన్.చంటిబాబు సూచించారు. మండలంలోని బిళ్లపాడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు మత్తు పదార్థాలు వినియోగిస్తే జరిగే అనర్థాలపై శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థి దశలో మత్తు పదార్థాలకు బానిసలుగా మారకుండా ఉండాలన్నారు. క్రమ శిక్షణతో చదువుకుని జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. మండలంలో ఎక్కడైనా నిషేధిత గంజాయి, డ్రగ్స్, కొకైన్, హెరైన్ తదితర మత్తు పదార్థాలు విక్రయిస్తే ఆయా గ్రామాల్లో ఉన్న ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం బీఎస్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుడివాడ టౌన్: పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఎలక్ట్రికల్ ఈఈ జీబీ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు, ఇతర కారణాల వలన ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మందపాడు, సత్యనారాయణపురం, మేదర బజార్, గుడ్‌మెన్ పేట, మున్సిపల్ ఆఫీసు, భాస్కర్‌టాకీస్, కోతిబొమ్మ సెంటర్, నలంద హైస్కూల్ రోడ్డు, ఎన్టీఆర్ స్టేడియం తదితర ప్రాంతాల్లో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

కూచిపూడి(మొవ్వ): గన్నవరంలో వచ్చే నెల 8, 9 తేదీల్లో నిర్వహించే సీపీఐ కృష్ణా జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా సమితి కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు కోరారు. మొవ్వ మండలం కూచిపూడి-పెదపూడి సెంటర్లోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారన్నారు. ఆయన పేదల సమస్యలను పట్టించుకోవటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో చందోలు నాగేశ్వరరావు, చెరుకు శ్రీనివాసరావు, కోదాటి నారాయణరావు, గొట్టిపాటి నాగేశ్వరరావు, కోసూరు వెంకట అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

మండవల్లి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల పరిషత్ అధ్యక్షుడు పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గాప్రసాద్ అధ్యక్షతన మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.రామలింగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. మండల స్థాయి అధికారులు తమ నివేదికలతో హాజరు కావాలని పేర్కొన్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరు కావాలని కోరారు.

రైతుల ప్రయోజనాలకు ప్రాధాన్యం



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాము

గుడివాడరూరల్: రైతుల ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇస్తూ మార్కెట్‌యార్డ్ అధికారులు, సిబ్బంది పని చేయాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. శుక్రవారం మార్కెట్‌యార్డ్‌ను యార్డ్ చైర్మన్ చాట్రగడ్డ రవికుమార్‌తో కలసి పరిశీలించారు. యార్డు ప్రాంగణంలో పెద్ద ఎత్తున ఖాళీ స్థలాలు, నిరుపయోగంగా ఉన్న గోడౌన్లు, షెడ్లు ఉండటాన్ని గుర్తించారు. అక్కడ ఉన్న ఆధునిక యంత్ర సామగ్రి పనితీరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యార్డ్ ద్వారా రైతులకు మేలు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో యార్డ్ కార్యదర్శి బి.సౌజన్య, ఏడీఎం నిత్యానందం, వ్యవసాయశాఖ ఏడీఏ రమాదేవి, కూటమి నాయకులు గణేష్, జగన్మోహనరావు పాల్గొన్నారు.

కౌలు రైతులు గుర్తింపు కార్డులు పొందాలి

ముదినేపల్లి రూరల్: మండలంలోని కౌలు రైతులు గుర్తింపు కార్డులు పొందాలని మండల వ్యవసాయాధికారి బి.వేణుమాధవ్ అన్నారు. కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ గుర్తింపు కార్డుల వలన పలు ప్రయోజనాలు పొందొచ్చన్నారు. గుర్తింపు కార్డులపై బ్యాంకుల్లో వ్యవసాయ రుణాలు పొందొచ్చని తెలిపారు. అదేవిధంగా పంటలు నష్టపోతే ప్రభుత్వం అందించే పరిహారం పొందడానికి అర్హులు అవుతారని పేర్కొన్నారు.

రైతుల అనుమతి లేకుండా విద్యుత్ టవర్ల నిర్మాణం



విలేకరులతో మాట్లాడుతున్న రైతులు

నందివాడ: మండలంలోని జనార్దనపురంలో కొంతమంది రైతులకు చెందిన పంట పొలాల్లో విద్యుత్ శాఖ అధికారులు హై టెన్షన్ లైన్లు వెళ్లే టవర్లను అనధికారకంగా తమ అనుమతి లేకుండా నిర్మిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం కొండపల్లి కుమార్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. 2023 ఏప్రిల్ 12న గ్రామంలో విద్యుత్ శాఖ అధికారులు గ్రామ సభ నిర్వహించి 'మీ గ్రామ పొలాల్లో నుంచి హై టెన్షన్ లైన్లు వెళుతున్నాయని, దాని నిమిత్తం టవర్లు నిర్మించాల్సి వస్తుంది' అని తెలిపారు. దీనిపై రైతుల అభిప్రాయాలు తీసుకున్నారని పేర్కొన్నారు. దీనిపై తమ గ్రామ రైతులు అభ్యంతరం తెలుపగా మళ్లీ 2023 అక్టోబర్ 26న గ్రామసభ నిర్వహించారన్నారు. అప్పుడు కూడా తమ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోలేదని తెలిపారు. దీనిపై గ్రామ రైతులు హైకోర్టును ఆశ్రయించగా 2024 మార్చి 15న విజయవాడలోని విద్యుత్ సౌధలో రైతులతో సమావేశం ఏర్పాటు చేశారని తెలిపారు. టవర్ల ఏర్పాటుపై రైతులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఈ విషయం కోర్టు పరిధిలో ఉండటంతో మీకు సమాధానం చెప్పనవసరం లేదని కోర్టు వారికి తెలియజేస్తామని విద్యుత్ సౌధ అధికారులు చెప్పారని పేర్కొన్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌ను కలిసి ట్రాన్స్‌కో అధికారులు ఏర్పాటు చేస్తున్న టవర్ల గురించి తాము నష్టపోతున్న విషయం గురించి వివరించామని తెలిపారు. ఈ క్రమంలో అనుమతులు లేకుండా అధికారులు దౌర్జన్యంగా పోలీస్ పికెట్ ఏర్పాటుచేసి తమను పొలంలోకి రానీకుండా టవర్ల నిర్మాణం ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతులు కొండపల్లి కుమార్‌రెడ్డి, గాదిరెడ్డి సుధాకర్ రెడ్డి, నీలం మురళీకృష్ణరెడ్డి, పల్లారెడ్డి వసంత్, బోనం వెంకటేష్ పాల్గొన్నారు.

సమ్మె నోటీసు ఇచ్చిన కార్మిక సంఘ నాయకులు



అసిస్టెంట్ కమిషనర్‌కు సమ్మె నోటీస్ ఇస్తున్న మున్సిపల్ వర్కర్స్ సంఘు నాయకులు

గుడివాడ టౌన్: కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు జూలై 9వ తేదీ జరగనున్న దేశవ్యాప్త సమ్మెకు సంబంధించి గుడివాడ మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు సమ్మె నోటీసు ఇచ్చారు. శుక్రవారం ఈ మేరకు మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ పి.శ్రీనివాసరావుకు సమ్మె నోటీసు ఇచ్చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ తాము సమ్మెకు సిద్ధం అయ్యామని ఈ మేరకు అధికారులకు నోటీస్ జారీ చేశామన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు డి. సత్యనారాయణ, ఎం. ఏడుకొండలు, సోమేశ్వరరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చిగురుకోట మీదుగా బస్సు నడపాలి

ముదినేపల్లి రూరల్: మండలంలో ప్రధానమైన వడాలి-తామరకొల్లు ఆర్అండ్‌బీ రోడ్డులోని చిగురుకోట మీదుగా ఆర్టీసీ బస్సును కైకలూరు వరకు నడపాలని ఈ రూటులోని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ రూటులో ఉన్న పెద కామనపూడి, తూర్పుపాకల, చిన్న కామనపూడి, నరసన్నపాలెం, చిగురుకోట, తామరకొల్లు గ్రామాలకు చెందిన ప్రజలు ప్రతినిత్యం ముదినేపల్లి, కైకలూరు, గుడివాడ అనేక పనుల నిమిత్తం వెళుతుంటారు. అదేవిధంగా ఈ గ్రామాలకు చెందిన విద్యార్థులు కళాశాలలకు వెళుతుంటారు. వీరికి బస్సు సౌకర్యం లేకపోవడంతో అధిక చార్జీలు చెల్లించి ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోంది. గతంలో ఈ రూటులో గుడివాడ డిపో నుంచి కైకలూరు వరకు ఆర్టీసీ బస్సు సర్వీసు నడిపేవారు. రహదారి దెబ్బతినడంతో ఈ సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేశారు. ఈ రహదారిని అభివృద్ధి చేయడంతో తిరిగి బస్సు సర్వీసును కొనసాగించాలని ఈ రూటులో ప్రయాణించే విద్యార్థులు, ప్రయాణికులు కోరుతున్నారు.

సర్పంచ్‌లకు సమాచారం ఇవ్వకపోతే ఎలా?

పెదపారుపూడి: గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతుంటే స్థానిక సర్పంచ్‌కు ప్రొటోకాల్ ప్రకారం సమాచారం ఎందుకు ఇవ్వటం లేదని పాములపాడు సర్పంచ్ పత్తిపాటి హర్షవర్ధన్ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ గోగం సురేష్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖల వారీగా అధికారులను అభివృద్ధి పనులను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని పాములపాడులో రెండు సీసీ రోడ్ల నిర్మాణ పనులు జరుగుతుంటే తనకు ఎందుకు సమాచారం ఇవ్వలేదని సర్పంచ్ హర్షవర్ధన్ పంచాయతీ రాజ్ ఏఈ రామ్మోహనరావును ప్రశ్నించారు. ఇలాంటి సమస్య రాకుండా చూసుకోవాలని ఎంపీడీఓ విమాదేవి అధికారులను ఆదేశించారు. అనంతరం ఎంపీపీ సురేష్ మాట్లాడుతూ మండలాభివృద్ధికి అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ వెలగల పద్మ, ఎంపీటీసీ సభ్యులు జాజుల శ్రీనివాసరావు, వేమూరి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక స్థలంలో నిర్మిస్తే అభ్యంతరం లేదు



సమావేశంలో పాల్గొన్న నాయకులు, వార్డు సభ్యులు

మండవల్లి: మండవల్లి పోలీస్ స్టేషన్‌ను తరుగుమూల సామాజిక స్థలంలో నిర్మిస్తే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని పలువురు లబ్ధిదారులు పేర్కొన్నారు. స్థానిక నాగసుబ్రహ్మణ్యం కల్యాణ మండపం వద్ద ఈ మేరకు నాయకులు, వార్డు సభ్యులు సమావేశం శుక్రవారం నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్ మండవల్లిలోనే ఉండాలని అఖిలపక్ష నాయకులు గతంలో తీర్మానం చేశారు. పంచాయతీ 2006లో పోలీస్ స్టేషన్‌కు 20 సెంట్ల భూమిని తరుగుమూలలో కేటాయించింది. దీనిపై ఇళ్ల స్థలాల లబ్ధిదారులు గతంలో ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం లబ్ధిదారులు, వార్డు సభ్యులు అక్కడ పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు ఎలాటి అభ్యంతరం లేదని తెలిపారు. మాజీ సర్పంచ్ గుడివాడ చిట్టిబాబు, మల్లేశ్వరస్వామి ఆలయ చైర్మన్ గుడివాడ బాలాజీ, యార్లగడ్డ శంకర్, వీరవల్లి శివయ్య, మెండా సురేష్‌బాబు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ ఈసీఈలో యాసిన్ స్టేట్ ఫస్ట్



కలిదిండి(కైకలూరు): పాలిటెక్నిక్ ఈసీఈ బ్రాంచ్ 4వ సెమిస్టర్ పరీక్షల్లో కలిదిండి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థి మహమ్మద్ యాసిన్ రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం పొందాడు. ఈ ఏడాది ఏప్రిల్‌లో సెమిస్టర్ పరీక్షలు జరిగాయి. ఇటీవల ఫలితాలు వెలువడ్డాయి. మొత్తం 1000 మార్కులకు 995 మార్కులు యాసిన్ సాధించాడు. కలిదిండికి చెందిన యాసిన్‌ను శుక్రవారం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డీఎస్‌వీఎస్ ప్రసాద్, అధ్యాపకులు ఎంసీహెచ్ రమణ, కె.విజయ్ కుమార్, బి.సైదా నాయక్ అభినందించారు.

ఎన్‌సీసీ క్యాడెట్‌ల ఎంపిక



కొత్తగా చేరిన ఎన్‌సీసీ క్యాడెట్‌లతో అధికారులు

గుడివాడ టౌన్: స్థానిక ఏకేటీపీ మున్సిపల్ బాలికోన్నత పాఠశాల్లో ఎన్‌సీసీ క్యాడెట్‌ల ఎంపిక శుక్రవారం జరిగింది. 4వ ఆంధ్ర బాలికల బెటాలియన్ విజయవాడ ఎన్‌రోల్‌మెంట్‌లో కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ బలేందర్‌సింగ్ నేతృత్వంలో ఈ ఎంపిక జరిగినట్లు ఎన్‌సీసీ ఆఫీసర్-2 కె.అనురాధ తెలిపారు. క్రమశిక్షణకు మారుపేరైన ఎన్‌సీసీలో బాలికలు చేరడం అభినందనీయమని పేర్కొన్నారు. పాఠశాల హెచ్ఎం ఎం. ప్రమీలా రాణి, ఎన్‌సీసీ ఆఫీసర్లు జేసీఓ కుందన్, హవల్దార్ రమణారెడ్డి, జీసీఐ స్వరూప పాల్గొన్నారు.